రెండువేల ఏళ్లకిందట దక్షిణదేశంలో వర్ధమానుడనేవా డుండేవాడు. అతని తండ్రి మిక్కిలి ధనవంతుడు. ఆయనకు సముద్ర వ్యాపారం ఉండేది. ఆయన ఓడలు నిర్మించి, వాటిమీద తన మనుష్యులను సముద్రంలోని ద్వీపాంతరాలకు పంపి వ్యాపారం చేసేవాడు. సముద్రప్రయాణం చేసి వచ్చిన మనుష్యులు ఇతరదేశాల వింతలు తండ్రికిచెబుతుంటే వర్ధమానుడు వింటూ ఉండేవాడు; తానుకూడా ఆ దేశాలు చూడాలని అభిలాషపడేవాడు.

తండ్రి లోకాంతరగతుడై వ్యాపారం తనవశంకాగానే వర్ధమానుడు బ్రహ్మాండమైన ఓడ ఒకటి కట్టించాడు. దానికి బ్రాహ్మణుల చేత పుణ్యాహవాచనం చేయించాడు. తన ప్రయాణానికి ముహూర్తం పెట్టించాడు. వేలాది ప్రజలకు అన్నదానమూ, వస్త్రదానమూ చేశాడు. ఓడనిండా వర్తకానికి అవసరమైన వస్తువులూ, మూడునెలల ప్రయాణానికి సరిపడే ఆహారపదార్థాలూ పెట్టించాడు. ముహూర్తానికి సరిగా ఓడ రేవులోనుంచి కదిలింది. తూర్పుదీవులకేసి సాగింది.

ఒక వారంరోజులు ప్రయాణం సక్రమంగానే జరిగింది. ఆ తరువాత ఒక పెద్ద తుపాను ప్రారంభమైంది. ఈ తుపాను క్రమంగా పెద్దదై, భయంకరంగా పరిణమించింది. ఓడ వాయువేగంతో తుపానులో పడి కొట్టుకుపోసాగింది. అది ఎటు పోతున్నదీ ఎవరికీ తెలియదు. ఈ విధంగా మూడు పగళ్లూ, మూడు రాత్రులూ తుపానులో కొట్టుకుపోయి ఓడ సముద్ర మధ్యాన

జోనాథన్ స్విఫ్టు వ్రాసిన గల్లివర్స్ ట్రావెల్సుకు అనుకరణ.

రాళ్ల గుట్టలకు తగిలి, పగిలి, మునిగి పోయింది. రెండు మూడు లక్షల విలువ రత్నాలూ, వస్త్రాలూ మొదలైన సరుకులు సముద్రంపాలు కావటమే కాక, ఓడలో ఉన్న నూరుమంది ప్రాణులూ సముద్రానికి బలిఅయినారు.

వర్ధమానుడు మాత్రం ప్రాణరక్షణార్థం ఒక ఓడ దూలాన్ని పట్టుకుని దాని సహాయంతో ఈదసాగాడు. కాని త్వరలోనే అతనికి స్పృహ తప్పిపోయింది. ఆ తర్వాత ఏమి జరిగిందీ అతనికి తెలియదు. అతనికి తిరిగి ఒళ్లు తెలిసేసరికి ఎండ కాస్తున్నది. సముద్రం ప్రశాంతంగా ఉంది. అతను మళ్లీ ఈదటానికి దూలంమీదినుంచి దిగి, నీటిలో నిలబడేసరికి అతని కాళ్లకు అడుగు తగిలింది. అక్కడ సముద్రం అతనికి మొలలోతే ఉంది. అయినా తీరం చాలా దూరాన ఉంది. వర్ధనుడు నీటిలో నడుచుకుంటూ ఒడ్డుకేసి రాసాగాడు.

అక్కడితీరం నిర్మానుష్యంగా ఉంది. తన ప్రాణం దక్కినందుకు వర్ధనుడు యిష్టదేవతలను ప్రార్థించుకుని. అక్కడే పచ్చికబయలుమీద పడుకుని తిరిగి నిద్ర పోయాడు. అతను నిద్రలేచేసరికి మర్నాడు



తెల్లవారుతున్నది. జరిగినదంతా అతనికి జ్ఞాపకం వచ్చింది. అతను లేచి కూర్చోబోయినాడు, కాని సాధ్యం కాలేదు. అతని చేతులూ కాళ్ళూ నేలకు అంటుకు పోయినట్టు తోచింది. తల కదిలిద్దామన్నా జుట్టు ఎవరో పట్టుకు లాగినట్టు నొప్పిపుట్టింది. కొన్ని వేల దారపుపోగులతో ఎవరో అతన్ని నేలకు కట్టివేశారు.

వర్ధమానుడు అత్యాశ్చర్యంతో ఇదేమిటా అని ఆలోచిస్తుండగా అతని కాలిమీద ఏదో పురుగు పాకుతున్నట్టు తోచింది. ఆ ప్రాణి క్రమంగా తన రొమ్ముమీదికి వస్తున్నది. వర్ధనుడు కష్టపడి తల కొంచెం యెత్తి చూచునుగదా, అతని రొమ్ముమీద నిలబడి ఉన్నది ఒకమనిషి! ఆ మనిషి ఎత్తు సరిగా అరంగుళాలు. ఆ మనిషి చేతిలో విల్లున్నది, భుజాన అంబులపొది ఉన్నది.

వర్ధమానుడు మేలుకొన్నాడని తెలుసుకుని ఆ మనిషి ఏదో కీచుకేక పెట్టాడు. మరో యాభైమంది మనుష్యులు వర్ధమానుడి వొంటిమీదుగా పాకి రాసాగారు.

"ఎవరు మీరు? నన్నెందు కిట్లా బంధించారు?" అన్నాడు వర్ధనుడు. అతని గొంతు ఆ చిన్నమనుష్యులకు ఉరుములాగా విని

పించి ఉండాలి. వారంతా బెదిరి పారిపోయినారు. కొందరు కంగారులో కిందపడి దెబ్బలుకూడా తగిలించుకున్నారు.

వాళ్ళ నడిగి లాభంలేదని వర్ధమానుడు తనచేతిని బలంగా గుంజాడు. దానికి కట్టిన దారపుపోగులన్నీ పుటపుటా తెగిపోయినాయి. తలకు, మిగిలిన అవయవాలకూ కట్టివున్న దారపు పోగులు కూడా తెంచుకోసాగాడు. తమబందీ తప్పించుకుంటున్నాడని గ్రహించి ఆ బుల్లిమనుష్యులు దూరం నుంచి వర్ధమానుడిమీద బాణాలవర్షం కురిపించారు. ఈ బుల్లి అంబులు పూచిక ముళ్లల్లే వర్ధమానుడి గడ్డల్లో యిరుక్కుపోయాయి. ముఖానికి తగిలినవి మటుకు చీమలు కుట్టినట్టు బాధ పెట్టాయి. వాళ్లు తనను ఏం చేస్తారో తెలుసుకుందామని వర్ధమానుడు కట్లు వొదల్చుకోవటం మాని కదలకుండా పడుకున్నాడు.

కొంచెంసేపటికల్లా ఆ మనుష్యులు, భయం కొద్దికొద్దిగా పోగొట్టుకుని, వర్ధనుణ్ణి సమీపించారు. ఒకడు అతని చెవిదగ్గిర ఏదో అరిచాడు. వర్ధమానుడికి ఆభాష అర్థం కాలేదు. కాని తనకు ఆకలి అవుతున్నదని సంజ్ఞలద్వారా తెలియజేశాడు. వెంటనే వారు వెళ్లిపోయి అతనికోసం ఆహారం తెచ్చారు. ఎన్నోవేలమంది అతని ముఖం మీదికి ఎక్కి ఆహారం అతనినోట్లో వేస్తేనే గాని అతని కడుపు నిండలేదు. ఎట్లాగైతేనేమి అతను పొట్టనింపుకుని మళ్లీ నిద్రపోయాడు.

★

వవర్ధమానుడు చేరిన ద్వీపంపేరు. వామన ద్వీపం. అక్కడిమనుష్యులు వామనులు. తమదేశానికి ఒక పెద్ద రాక్షసుడు వచ్చాడనేవార్త వామనరాజునకు తెలిసింది. అతనిని బంధించి తన దగ్గిరికి తీసుకురావటానికి రాజుగారు తన దగ్గిర ఉన్న బళ్లలో కల్లా పెద్ద బండిని పంపారు. వర్ధమానుడు భోజనం చేసి తిరిగి నిద్రపోతున్న సమయంలో రాజుగారు పంపిన బండి వచ్చింది. ఈ బండి ఏడడుగులుపొడుగూ, నాలుగడుగులు వెడల్పూ ఉంది. దానికి ఇరవైరెండు చక్రాలున్నాయి. వెయ్యిమంది వామనులు మూడు గంటలు శ్రమపడి వర్ధనుణ్ణి ఈ బండిమీదికి అతి శ్రమతో ఎక్కించగలిగారు. ఇంతసేపూ వర్ధమానుడు నిద్రలేవలేదు. కారణమేమంటే అతను తిన్న ఆహారంతోపాటు వామనులు అతనికి మత్తు కలిగించే సారాయికూడా ఇచ్చారు.

రాజమందిరం అక్కడికి అరమైలు దూరంలో ఉన్నది. వర్ధమానుడి బండికి పదిహేనువందల గుర్రాలు కట్టారు. ఆ గుర్రాలు నాలుగున్నర అంగుళాల ఎత్తు గలవి. ఈ బండి నాలుగు గంటలు ప్రయాణంచేసేసరికల్లా ఒక ఇరుసు విరిగింది. దానికి మరమ్మతు చెయ్యటానికి ఆగారు. ఈ సమయంలో వర్ధనుణ్ణి చూడటానికి కొందరు వామనులు అతని మొహం మీద ఎక్కారు. వారిలో ఒకడు తనకర్ర వర్ధమానుడి ముక్కుపుటంలోనికి పోనిచ్చి తడివిచూశాడు. వర్ధమానుడికి తుమ్ములు వచ్చాయి. ఆ తుమ్ములకు అతని ముఖం మీద ఎక్కినవారు అదిరి కిందపడి కాళ్లూ చేతులూ విరుచుకున్నారు. ఈ లోపుగా


M.T.V.

ఇరుసు మరమ్మతు పూర్తి అయి మళ్లీ ప్రయాణం సాగింది.

దారిలో చీకటిపడింది. వామనులు ప్రయాణంచాలించి ఒకచోటమజిలీచేశారు. తెల్లవార్లూ ఆ అయిదువందల మంది వామనులు వర్ధమానుడికి కాపలా కాశారు. అందులో సగంమంది దివిటీలు పట్టారు, మిగిలినవాళ్లు విల్లూ, బాణాలూ పట్టుకున్నారు. తిరిగి తెల్లవారగానే ప్రయాణం సాగింది. మిట్టమధ్యాన్నాని కల్లా బండి పట్టణానికి ఒక ఫర్లాంగు దూరంలోకి వచ్చింది.

అక్కడికి వామనమహారాజు వర్దనుణ్ణి స్వయంగా చూడటానికి అనుచరులతోసహా ఎదురువచ్చాడు. కాని రాజుగారు వర్దనుడి శరీరంమీదికి ఎక్కటం అపాయకరమని ఆయన పరివారం అడ్డుచెప్పింది.

ఇక్కడ ఒక పాడుబడిన గుడి ఒకటి ఉంది. అది కొంతకాలంకింద అపవిత్రమైపోవటంచేత పాడుపెట్టారు. అందులో వర్ధమానుడికి విడిదిఏర్పాటుచేశారు. ఆపట్టణంలో అతను పట్టే ఆవరణ అది ఒకటే.

రాజుగారి కమ్మరులు వచ్చి వర్ధనుడి కాలికి తొంభైఒక్క గొలుసుకట్టి వాటిని దేవాలయం వాకిలికి బంధించారు. ఆ తరువాత వర్ధమానుణ్ణికట్టిన పోగులన్నీ కోసివేశారు. అతని కాలికి కట్టిన గొలుసులు మన స్త్రీలు వేసుకునే బంగారు గొలుసులంత లావున్నాయి; అతను దేవాలయం లోపలగాని బయటగాని కొద్దిదూరం కదలటానికి వీలయినంత పొడుగున్నాయి.

[ఇంకా వుంది]



(గతసంచిక తరువాయి)

వర్ధమానుడికి వామనులు 'మనిషి పర్వతం' అని పేరు పెట్టారు. అతన్ని చూడటానికి వేలకు వేలు జనం వచ్చి దేవాలయంముందు వీథుల్లో బారులు తీర్చి నిలబడ్డారు. దేవాలయంలోనికి ఎదురుగా అయిదడుగుల ఎత్తు బురుజున్నది. రాజుగారూ, రాణీగారూ, వారి పరివారమూ ఈ బురుజులో ఎక్కి వింత చూస్తున్నారు.

వర్ధమానుడు దేవాలయం వాకిలికుండా లోనికి పాకిపోయి తన ఇల్లంతా చూసుకుని మళ్ళీ బయటికి వచ్చి, తన నిడివిని ప్రజలకు చూపటానికి లేచి నిలబడ్డాడు. అక్కడ నిలబడితే చుట్టూ ఉన్న ప్రదేశమంతా కొండపల్లి బొమ్మలాగా కనిపించింది. పొలాలలో నలభై అడుగుల చదరాల మళ్ళుకనిపించాయి. దూరాన అడవులున్నాయి. అందులో మరీ ఎత్తయినచెట్లు ఏడేసి అడుగు లున్నాయి. మరొక ప్రక్క బొమ్మరిల్లు అమర్చినట్టుగా పట్టణం ఉంది.

రాజుగారు వర్ధమానుడితో మాట్లాడటానికి బురుజు దిగి తన గుర్రం ఎక్కి వర్ధమానుడి దగ్గిరికి వచ్చాడు. కాని వర్ధమానుడి ఆకారం చూసి రాజుగారి గుర్రం బెదిరింది. మంచి రౌతుగనక ఆయన గుర్రం మీద నుంచి కింద పడకుండా, భటుల సహాయంతో ఉపాయంగా గుర్రం దిగి, వర్థమానుడి దగ్గిరకి కాలినడకనే వచ్చాడు. రాజుగారి వీలుకోసరం వర్థమానుడు నేలమీద పడుకున్నాడు. రాజుగారి చేతిలో దూసిన కత్తి ఒకటి ఉంది. అది సరిగా వర్థమానుడి చిటికెన వేలంత ఉంది. రాజుగారి నెత్తిమీద కిరీటం చిటికెన వేలి ఉంగరమంత ఉంది. అందులో రత్నాలు మెరుస్తున్నాయి.

జోనాథన్ స్విఫ్ట్ వ్రాసిన గల్లివర్స్ ట్రావెల్సుకు అనుకరణ.

MTV

రాజుగారు వర్ధమానుడితో గొంతు చించుకొని ఏదో మాట్లాడాడు, కాని వర్ధమానుడికి అర్థంకాలేదు. వర్ధమానుడికి చాలా భాషలు వచ్చు సంస్కృతమూ, ప్రాకృతమూ, పాళీ, పైశాచీ మొదలైన భాషలన్నిటిలోనూ రాజుతో మాట్లాడాడు. కాని ఆ భాష లేవీ రాజుగారికి తెలియవు. రాజుగారి ఆస్థానకవులకు కూడా వర్ధమానుడి భాష లేవీ అర్థం కాలేదు.

"ఇతడికి మనభాష రాదుగాని సాధువులాగే కనిపిస్తున్నాడు. ఇతనివల్ల మనకు చాలా ప్రయోజనం ఉండవచ్చు. కనక ఇతనికి సరిపడే ఆహారం ఇచ్చి జాగ్రత్తగా కాపాడండి" అని రాజు తన భటులకు ఆజ్ఞాపించాడు.

రాజపరివారం వెళ్లిపోగానే భటులు వర్ధమానుడికి అనేక బళ్ళమీద భక్ష్యాలూ, పానీయాలూ తెచ్చి భోజనంపెట్టారు. అతన్ని చూడవచ్చిన జనం ఎంతకీ వెళ్లలేదు. అందులో కొందరు రాలుగాయిలు అతనిమీద బాణాలు కూడా విసిరారు. ఇట్లా చేసినవాళ్లను రాజభటులు బంధించి శిక్షించమని వర్ధమానుడికి అందిచ్చారు. వర్ధమానుడు వారిని ఎత్తి తన జేబులో వేసుకున్నాడు. వాళ్ళని అతను నల్లులను రాచినట్టు రాచేస్తాడని ప్రజలుభయకంపితులైనారు. కాని వర్ధమానుడు వారితో ఆడుకొని చివరకు కట్లు విప్పి వారిని వదిలేశాడు. ఈ వార్త విని ఆస్థానంలో వర్ధమానుడికి చాలా ప్రశంసలు వచ్చాయి.

వర్ధమానుడికి ఒక పరుపు తయారు చేయమని రాజాజ్ఞ అయింది. రాజుగారి దర్జీలు ఈ పని ఎట్లా సాధ్యమవుతుందా అని ఆలోచించటానికి సమావేశమై ఆఖరుకు ఒక తీర్మానంచేశారు. అరువందల పరుపులు బళ్లమీద దేవాలయానికి చేర్చి వాటిని ఆ ఆవరణలోనే కలిపి కుట్టటానికి నిశ్చయించారు. నాలుగేసి చిన్నపరుపుల మందానా, నూటయాభై పరుపుల విస్తీర్ణానా వర్ధమానుడి పక్క తయారయింది. ఇది

కూడా అతనికి తగినంత మందంగా లేదు. ఈ విధంగానే అతనికి దుప్పట్లు కూడా తయారుచేశారు. జేబురుమాల సైజున ఉన్న మామూలు దుప్పట్లు అనేకవందలు కలిపి చేతికుట్లు కుట్టి. పక్కమీద పరుచు కొవటానికీ దుప్పట్లు తయారుచేశారు. ఈ దుప్పట్లు పది పన్నెండు పరసలు కుడితే గాని వర్ధమానుడికి చలికాసే దుప్పటి తయారు కాలేదు.

వర్ధమానుడికి వామనభాష నేర్పటానికీ, వర్ధమానుడిభాష నేర్చుకుని అతని చరిత్ర తెలుసుకోటానికీ రాజుగారు పండితుల నియమించాడు. వామన దేశాచారానికి అనుకూలంగా వర్ధమానుడికి దుస్తులు నిర్మించటానికి మూడువందలమంది దర్జీలు నియమించబడ్డారు. అతన్నిచూసి బెదరకుండా ఉండగలందులకు రాజుగారి అశ్వాలకు వర్ధమానుడి సమక్షంలో రోజూ కవాతు ఇవ్వసాగారు.

"మనిషి పర్వతాన్ని" చూడటానికి పల్లె పట్టులనుంచి తీర్థప్రజ కింద రాజధానికి రోజూ వస్తున్నారు. ఇట్లా వచ్చే మూర్ఖ ప్రజవల్ల రాజమిత్రుడైన వర్ధమానుడికి అపాయంతటస్థించే అవకాశం ఉంది. అందుచేత పల్లెలనుండి రాజధానికి వచ్చే ప్రజలకు "పెర్మిట్లు" ఏర్పాటు చేశారు



రాజుగారు. అవితేనిదే ఎవరూ రాజధానిలో అడుగుపెట్టరాదు. రాజుగారిలా చేయక పోతే దేశంలో ఉండే ప్రజలంతా పని పాటలు మానేసి వర్ధమానుడిదగ్గిరే యాత్ర చేసేవాళ్లు.

సామాన్యప్రజలకు వర్ధమానుడి మీది భయం క్రమంగా తొలిగిపోయింది. వాళ్లు అతనిదగ్గిరకి చనువుగా రాసాగారు. అతని అరిచేతమీద తడవకు అయిదారుగురు చొప్పున నృత్యాలు చేసేవారు. చిన్నపిల్లలు యథేచ్ఛగా అతనిజుట్టులో దాగుడుమూత లాడసాగారు.

వర్ధమానుడికి దేశభాష వచ్చాక రాజు గారు అప్పుడప్పుడూ వచ్చి అతనిచేతిమీదా, భుజంమీదా ఎక్కి సంభాషించేవాడు. తన దేశప్రజలయెడల స్నేహంతో ఉన్నం దుకు అతన్ని అభినందించేవాడు.

"నన్ను తమరు అన్నివిధాలా ఎంతో చక్కగా చూస్తున్నారుగాని ఈ గొలుసులు వదిలించినట్టయితే నేనింకా తమకు కృత జ్ఞుడనై ఉండగలను" అని వర్ధమానుడు రాజుగారికి విన్నవించుకున్నాడు.

"చూద్దాం, చూద్దాం!" అంటూ రాజు గారు ఏదీ చెప్పకుండా మాట తప్పించి ఇంటికి వెళ్లిపోయాడు.

దీనికీ కారణం లేకపోలేదు. రాజుగారి ఆస్థానంలో కొందరు వర్ధమానుణ్ణి నిర్మూలించాలనే ఉద్దేశం కలిగిఉన్నారు. ఇంత బలిష్టుడివల్ల రాజ్యానికి ఎప్పటికైనా ముప్పేనని వాళ్ల నమ్మకం. ఈ సంగతి వర్ధమానుడు ఆనోటా ఆనోటా తెలుసుకున్నాడు. కాని, రాజుగారు తనపట్ల మిత్రుడై ఉండగా తన కేభయమూ లేదనుకున్నాడు. ఈసారి మళ్లీ రాజుగారు తనను చూడటానికి వచ్చినప్పుడు తన విడుదల విషయం అడిగాడు.

"స్వయంగా నాకేమీ అభ్యంతరంలేదు. కాని, ఇది పూర్తిగా నా చేతిలో ఉన్న పని కాదు. నా మంత్రులూ, అనుచరులూ నీ విషయంలో భయంతో ఉన్నారు. వారి భయం పోగొట్టాలంటే నిన్ను నా భటులు వెతకటం తప్పని సరి. నీ సహకారం లేకుండా నా భటులు నిన్ను వెతకలేరు. దానికి సమ్మతమేనా?" అన్నాడు రాజు.

తనను రాజభటులు వెదకటానికి వర్ధమానుడు అంగీకరించాడు. అతని దుస్తులు అన్వేషించటానికి ఇద్దరుభటులు వచ్చారు. వర్ధమానుడు వారిని తన జేబు లన్నిటిలోకీ దింపాడు. వాళ్లు వెళ్లి రాజుగారితో ఈ విధంగా విన్నవించుకున్నారు:

"ప్రభూ, మనిషిపరత్వంజేబుల్లో మాకు చాలా వింతవిషయాలు కనిపించాయి. ఒక

జేబులో తమ పడకగదిలో పరచటానికి సరిపడే గోనెపట్టాలాటి ముతకగుడ్డ కనిపించింది. (ఇది వర్ధమానుడి చేతిరుమాలు). ఆ జేబులోనే పెద్ద పెద్ద బంగారు దిమ్మెలు కనిపించాయి. వాటి మీద పెద్ద అక్షరాలూ బొమ్మలూ చెక్కి ఉన్నాయి. (ఇవి బంగారు నాణెములు). మరొకజేబులో పెద్ద వెండిపెట్టె కనిపించింది. అది తెరిపించిచూడగా అందులో మోకాలిలోతున మట్టివంటి పొడి ఉంది. అందులో మేము దిగేసరికి మాకు తుమ్ములు పట్టుకుని చాలా బాధకలిగింది. (ఇది వర్ధమానుడి నస్యం డబ్బీ). అతని దగ్గిర ఒక విచిత్రమైన నిచ్చెనలాటి వస్తు

M.T.V

వున్నది. అయితే ఈ నిచ్చెనకు ఒకవైపే దూలం ఉన్నది. ఈ దూలంమీద భయంకర మైన ముళ్లు పలుగుల్లాగా నిలబడి ఉన్నాయి. (ఇది దువ్వెన) బంధితుడి నడుమున బ్రహ్మాండమయిన దూలం వేలాడుతున్నది. అది లోహంతో చేసినట్టు కనిపిస్తున్నది. దీని ఉపయోగమేమిటో తెలియరాలేదు. (ఇది వర్ధమానుడి కత్తిఒర).'

రాజుగారు మూడువేలమంది సాయుధ భటులను వెంటబెట్టుకొని ఈ జాబితాలో ఉన్న వస్తువులన్నీ ఇవ్వమని వర్ధమానుణ్ణి అడిగాడు. వర్ధమానుడు రాజభటులు చూపిన వస్తువులన్నీ ఇచ్చేస్తూ ఒరలో నుంచి కత్తిదూసి చూపాడు. ఎండలో కత్తి తళ తళ లాడుతూంటే రాజభటులు దిగ్భ్రమ చెందిపోయినారు. రాజుగారు ఆ కత్తి మళ్లీ ఒరలోపెట్టించి దాన్నికూడా పుచ్చుకున్నారు.

ఇది జరిగినాక తనను బంధ విముక్తుణ్ణి చెయ్యవలసిందని వామనభాషలో వర్ధమాను డొక అర్జీ పెట్టుకున్నాడు. కొన్ని షరతులమీద అతనికి బంధవిముక్తి కలిగించారు. ఆ షరతులేవంటే, వర్ధమానుడు రాజాజ్ఞ లేకుండా దేశంవిడిచి పోగూడదు. రాజధానిలో అడుగుపెట్టాలంటే రెండు గంటలు ముందుగా తెలియజేయాలి. జనం వీథులన్నీ ఖాళీచేయటానికిగాను ఇట్లా తెలియజేయాలి. వర్ధమానుడు రాజవీథులలోతప్ప సంచరించరాదు. పచ్చిక బయళ్లలోను, పొలాలలోనూ అతను పడుకోరాదు. ఎవరిమీదా, ఎవరి ఆస్తిమీదా కాలువేయరాదు. శత్రువులు మీదపడే పక్షాన వర్ధమానుడు వామనులపక్షాన పోరాడాలి. ఈ షరతులకు ఒప్పుకుని వర్ధమానుడు బంధవిముక్తి పొందాడు.

[ఇంకా వుంది]



(గతసంచిక తరువాయి)

ఇది జరిగిన కొద్దికాలానికే వర్ధమానుడు రాజధాని నగరానికి పోవటానికి అనుమతి, ఆహ్వానమూ కూడా సంపాదించాడు. "మనిషిపర్వతం" వస్తున్నవార్త వినగానే జనమంతా ఇళ్లలో దూరారు. అనేకమంది అతన్ని చూడటానికి ఇళ్ళకప్పు లెక్కారు. రాజవీధుల్లో తప్ప అతనికి నడవటానికి జాగాలేదు. ఊరిమధ్య రాజభవనంఉంది. దానిచుట్టూ ప్రహరీగోడ లున్నాయి. వర్ధమానుడు వాటిమీదిగా అంగవేసి అంతపుర ఆవరణ ప్రవేశించాడు. అతను లోపల ఉన్న ఆసనాలూ, తివాసీలూ మొదలైనవి చూడటానికి నేల బారుగా పడుకుని కిటికీలో నుంచి చూడవలసి వచ్చింది.

రాజుగారు చూపిన ఆదరానికి వర్ధమానుడు చాలా సంతోషించాడు. తన కృతజ్ఞత యెట్లా చూపడమా అని ఆలోచించాడు. ఇందుకు అవకాశం త్వరలోనే కలిగింది.

వామనద్వీపానికి దగ్గరలో మరొక చిన్న ద్వీపం ఉన్నది. అక్కడి ప్రజలు కూడా వామనులవంటివారే. వారిపేరు గుజ్జులు. గుజ్జులకూ వామనులకూ అనాదిగా పోట్లాట లున్నాయి. కాని ఇటీవల కొద్దిమాసాలుగా ఈ పోట్లాటలకు విరామం కలిగింది. కారణ మేమంటే గుజ్జులరాజు వామనుల మీద దాడిచెయ్యటానికి కొన్ని కొత్తనావలు సిద్ధం చేయించాడు. ఈ యుద్ధనావలు

జోనాథన్ స్విఫ్టు వ్రాసిన 'గల్లివర్స్ ట్రావెల్సు'కు అనుకరణ.

యిప్పుడు సిద్ధమయాయనీ, గుజ్జులు ఏ క్షణాన అయినా దండెత్తి రావచ్చుననీ వామనరాజుకు కబురు వచ్చింది. ఆయన వర్ధమానుడి సహాయం కోరాడు. వామనులకు సహాయంచేస్తాననీ, తాను చెప్పినట్టు చేస్తే గుజ్జుల యుద్ధనౌక లన్నిటినీ పట్టి తెస్తాననీ వర్ధమానుడు చెప్పాడు.

రాజుకు పరమానందం కలిగింది. ఏమేమి కావాలో చెప్పి చేయించుకోమన్నాడు. వర్ధమానుడు తనకు తగినంత మోకూ, లావుపాటి ఇనపచువ్వలూ కావాలన్నాడు. కాని వామనుల దగ్గిర ఉన్న మోకులు ట్వయిను దారంకంటె ఆటే లావులేవు; ఇనపచువ్వలు తీగ మేకుల లాగున్నాయి.

వీటితోనే వర్ధమానుడు పని ప్రారంభించాడు. తనకుదొరికిన తాటిని మూడుపేటల పేని కాస్తబలమైన తాడు తయారుచేశాడు. ఈ విధంగా యాభైతాళ్లు తయారుచేశాడు. మూడేసిచువ్వలు కలిపి మెలిపెట్టి, వంచి, యాభైకొంకీలు తయారుచేశాడు. ఒక్కొక్క తాటి చివరా ఒక్కొక్క కొంకీ కట్టాడు.

M.T.V.

వీటన్నిటినీ భుజానవేసుకొని గుజ్జులనౌకలు వచ్చే దిక్కుగా సముద్రతీరానికి వెళ్లాడు.

గుజ్జులద్వీపానికీ వామనద్వీపానికీ మధ్య సన్నని జలసంధి మాత్రమే అడ్డం ఉంది. ఇది యెక్కడా నిలువులోతుకంటె లేదు. వర్ధమానుడికి దూరాన గుజ్జులనౌకలు కని పిస్తూనే ఉన్నాయి. అన్నీ కలిసి యాభై యుద్ధనౌకలూ, కొన్ని చిల్లరపడవలూ ఉన్నాయి. వర్ధమానుడు నీటిలో దిగి వాటి కేసి నడువసాగాడు.

అతను ఏంచేస్తాడో చూద్దామని వామనుల రాజూ అతని పరివారమూ తీరానికి వచ్చారు. గుజ్జులు నౌకలలో ఏదో పనులు చేసుకుంటూ తమకు రానున్న ఆపద గురించి ఆలోచించటమే లేదు. "మనిషి పర్వతం" గురించి వారికి వార్త చేరలేదు.

వర్ధమానుడు కొద్దిదూరం ఈదినాక మళ్లా అవతల అడుగు అందింది. అతను నీళ్ళలోనుంచి నడుచుకుంటూ వచ్చే చప్పుడు విని గుజ్జులు పొందిన



ఆశ్చర్యం చూసి తీరాలి. పెద్ద భూతంవంటి మనిషి వస్తూండటం చూడగానే గుజ్జులు నౌకలమీద తాముచేస్తున్న పనులుమానేసి ప్రాణాలు రక్షించుకునేటందుకు పారిపోయినారు. వాళ్లను చూస్తూ కాలయాపనచెయ్యాక వర్ధమానుడు తాను తెచ్చిన తాళ్ళను పడవలకు కొంకిలతో బిగించి కట్టి, తాళ్ళన్నిటినీ కలిపి ముడేసి, ఆ ముడి చేత్తో పట్టుకున్నాడు.

ఈలోగా గుజ్జులు చూస్తూ ఊరుకోలేదు. వారు విల్లు బాణాలు పట్టుకొని ఈసమయానికి వర్ధమానుడిమీద బాణాల వర్షం కురిపించ సాగారు. ఆ బాణాలు కంటికి తగులుతా యనే భయంతప్ప వర్ధమానుడికి మరే భయమూలేదు. అందుచేత అతనిప్పుడు రాజభటుల కంటపడకుండా దాచిన సులోచనాల జోడుతీసి కళ్లకు తగిలించుకొని నిర్భయంగా తనపని చూసుకో సాగాడు.

అయితేఇప్పుడు మరొకచిక్కు వచ్చింది. గుజ్జుల నౌకలన్నిటికీ లంగర్లు దించి ఉన్నాయి. వీటిని ఎత్తేఅవకాశం లేదు. అందుచేత వర్ధమానుడు తన పిడి చాకుతో లంగరు గొలుసులన్నీ గబగబా కోసి పారేశాడు. ఇది చూసి గుజ్జులకు మరింత ఆదుర్దా కలిగింది. వాళ్లు వర్ధమానుడిమీద మళ్లీ బాణాలు కురిపించారు. కాని వర్ధమానుడు వాటికి లక్ష్యంచెయ్యకుండా పడవలను పట్టుకుని తిరిగి వచ్చాడు. అతని వెనకనే యాభై శత్రునౌకలూ వస్తున్నాయి.

ఇదిచూసి సముద్రతీరానచేరిన ప్రజలు ఒక్కసారిగా, "వామనమహారాజుకూ జై!" అని కేకలుపెట్టారు. మహారాజు కూడా సంతోషంతో పరవశుడైపోయి వర్ధమానుడికి ఒక పెద్ద బిరుదిచ్చాడు.

ఈవిధంగా రాజుగారి అదరానికిపాత్రం కావడం వర్ధమానుడికే అపకారమయింది. వామనులకు యింత సహాయంచేసిన వర్ధమానుడు యింకెంత చెయ్యలేడు? అని రాజుకు దుర్యాశ పుట్టింది.

"నువు వెంటనే వెళ్లి గుజ్జుల మిగత పడవలు కూడా పట్టుకో. ఒక్క పడవలు పట్టుకోటం కాదు. గుజ్జులను పూర్తిగా నాశనంచెయ్యటానికీ, వాళ్లదేశాన్ని పూర్తిగా ఆక్రమించుకోవడానికీ నువు సహాయపడాలి. అప్పుడు నేను ప్రపంచాని కంతకీ అధిపతి నౌతాను" అన్నాడు రాజుగారు వర్ధమానుడితో.

ఇటువంటి దుర్మార్గానికి వర్ధమానుడు ఒప్పుకోక, 'గుజ్జులరాయబార్లు చెప్పే న్యాయమైన షరతులకు ఒప్పుకుని మీరు సంధి చేసుకోవడం ధర్మం' అన్నాడు రాజుతో.

గుజ్జుల రాయబారులు సంధికోసంవచ్చి, వర్ధమానుడు తమకున్యాయంగా మాట్లాడాడని విని అతని దర్శనం చేసుకుని, అతని శౌర్య పరాక్రమాలనూ గుణ గణాలనూ పొగడి, తమ దేశం రావలసిందనీ, తమ రాజుగారికి దర్శనం ఇప్పించవలసిందనీ కోరారు. వర్ధమానుడు కూడా గుజ్జుల రాజుగారి కీర్తి జగద్విఖ్యాతమనీ, వారికి తన నమస్కారాలు అందజేయవలసిందనీ, ఎప్పటికైనా తప్పక తాను ఆ రాజుగారి

దర్శనం చేసుకోకుండా స్వదేశానికి వెళ్లిపోవనీ రాయబారులకు తెలియజేశాడు.

వర్ధమానుడు సహాయనిరాకరణం చెయ్యటం వల్ల వామనరాజుగారు గుజ్జురాయబారుల షరతులపైనే సంధి చేసుకోవలసి వచ్చింది. కాని, ఆయనకు వర్ధమానుడిమీద ఆగ్రహం కలిగినవి. అతని మీద దుస్తంత్రాలు పన్నేవారి మాటలు రాజుగారు ఆలకించసాగాడు.

గుజ్జులదేశానికి వెళ్లాలని వర్ధమానుడికి ఆత్రం కలిగింది. అక్కడికి పోవటానికి రాజుగారి అనుమతి వేడాడు. రాజుగారు బలవంతాన అనుమతించాడు. కాని రాజు తనను హత్య చేయించటానికి ప్రయత్నిస్తున్నాడని వర్ధమానుడు తనహితులద్వారా తెలుసుకున్నాడు. ఇది అసత్యవార్త అని తోచింది కాని, వెంటనే నిజమేనని రూఢి అయింది. కనుక, అలస్యం చేయకుండా తక్షణమే వర్ధమానుడు గుజ్జులరాజు దగ్గిరికి ప్రయాణమైపోయి అభయం పొందాడు.

కొద్దికాలం అక్కడగడిచినాక ఒకనాడు దారితప్పిన ఓడ ఒకటి గుజ్జులదేశం సమీపించగా వర్ధమానుడు అందులో ఎక్కి స్వదేశానికి ప్రయాణంకట్టాడు. గుజ్జులరాజు అతనికి ఎంతో సహాయంచేసి అనేక బహుమతులతో సహా సాగనంపాడు.

కొద్దిరోజులకు వర్ధమానుడు సురక్షితంగా తన స్వదేశానికి తిరిగి వచ్చేసి ఆ కథలన్నీ పిల్లలకు చెప్పసాగాడు

[ఇంకా వుంది]



[గతసంచిక తరువాయి]

కొన్ని సంవత్సరాలు గడిచాయి. వర్ధమానుడి ఓడలు సముద్రాలన్నీ చుట్టి వ్యాపారం సాగిస్తున్నాయి. కాని అతని బుద్ధి వ్యాపారంమీద లేదు. ప్రపంచంలో ఉన్న వింతలు చూడాలనే అభిలాష అతన్ని వేధించసాగింది. వామన ద్వీపంలో అతనికి కలిగిన అనుభవాలు అందరికీ చెప్పి చెప్పి పాతబడిపోయాయి. మరొక విచిత్రానుభవంకోసం వర్ధమానుడు తహ తహ లాడసాగాడు.

ఒకనాడు వర్ధమానుడు వ్యాపారం వంకపెట్టుకుని తన ఓడలలో కల్లా మంచి ఓడమీద కొద్ది సరుకువేసుకుని తన దగ్గర ఉండే మంచి కళాసులను వెంటబెట్టుకుని సింహళద్వీపానికి ప్రయాణం కట్టాడు. అక్కడ తన సరుకంతా అమ్ముకుని ఆరు నెలలకు సరిపోయే ఆహారపదార్థాలు తీసుకుని ఓడను పశ్చిమాభిముఖంగా నడిపించాడు.

పశ్చిమసముద్రం అతి ప్రమాదకరమైనది. అందులో నిత్యమూ తుపానులు రేగుతూ ఉంటాయి. ధైర్యశాలులైన నావికులు సహితం ప్రాణాలరచేతబట్టుకుని ప్రయాణంచేస్తారు. వర్ధమానుడి ఓడ త్వరలోనే ఈ తుపానులలో చిక్కుకుని దాని యిష్టంవచ్చిన దిక్కుగా పోసాగింది. కళాసులుమట్టుకు ఓడ మునిగిపోకుండా చాలా జాగ్రత్తపడ్డారు. ఈ విధంగా పోయి పోయి అనేకవారాలకు ఓడ మునిగిపోకుండా ఒక తీరం చేరింది. ఆ తీరం చూస్తే అది ద్వీపమో, ఖండమో తెలియరాలేదు. కనుచూపు మేరవరకూ తీరం ఉత్తర దక్షిణాలకు విస్తరించి ఉంది.

జోనాథన్ స్విఫ్టు వ్రాసిన 'గల్లివర్స్ ట్రావెల్సు'కు అనుకరణ

తీరమంతా గుట్టలమయంగా ఉంది. అందుచేత ఓడను కొంతదూరంలో నిలిపి, వర్ధమానుడూ అతని అనుచరులూ మంచి నీటి కోసం ఒడ్డుకువచ్చి అన్వేషించసాగారు. దాపున ఎక్కడా మంచినీటిబావుల జాడలేదు. అందుచేత కొందరిని ఒక దిక్కుగా పంపి మరొకదిక్కుగా వర్ధమానుడు బయలుదేరాడు.

ఆప్రదేశమంతా గుట్టలమయంగాఉంది. ఎంత తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అందుకని వర్ధమానుడు తిరిగి ఓడ దగ్గిరికి రాసాగాడు. కాని అతను అంత దూరం నుంచే ఓడను చూచునుగదా, అది లంగరు ఎత్తి శరవేగంతో సముద్రంమీదికి వెళ్లిపోతున్నది!

వర్ధమానుడుకి చెప్పరాని ఆగ్రహం వచ్చింది. తన అనుచరులకు మతి పోయిందా?తనను వాళ్లుమోసంచేస్తున్నారా? తనను ఈ తెలియనిచోట వదిలేసి ఎందుకు వాళ్లట్లా పలాయనంచేస్తున్నారు? ఈవిధంగా అనుకుంటుండగానే అతనికి ఒక భయంకర దృశ్యం కనిపించింది. ఒక బ్రహ్మాండ

మైన రాక్షసుడు సముద్రంలో దిగి తన ఓడను వెంటాడుతున్నాడు. వాడి ఆకారం చూస్తూనే వర్ధమానుడు కొయ్యబారి పోయినాడు. ఈ రాక్షసుడు తనపడవను అందుకుంటాడేమో నని అతనికి భయంకూడా కలిగింది. కాని, అతని నావికులు చాలా సమర్థులు కావటంచేత త్వరలోనే కనుచూపుమేర దాటిపోయినారు. ఆ రాక్షసుడు ఓడను పట్టుకునే ఆశవదిలి వెనక్కు తిరిగి రాసాగాడు. వాడు తనను ఎక్కడ చూస్తాడో అనేభయంతో వర్ధమానుడు కాలిబలంకొద్దీ పరుగెత్తి అడ్డం వచ్చిన ఒక గుట్ట ఎక్కాడు.

గుట్టమీదినుంచి చూస్తే రాక్షసుడి జాడ తెలియరాలేదు. తను రాక్షసుణ్ణి చూసినది నిజమా భ్రమా అని సందేహం కూడా కలిగింది. చుట్టూతా మూడునిలువులఎత్తు రెల్లు కనిపించింది. కాని అది రెల్లు కాదు, గడ్డి. గుట్టకు అవతలవేపు గోధుమపొలం ఉంది. కాని తొమ్మిది నిలువుల ఎత్తుండటంవల్ల వర్ధమానుడికి అది పొలమని తెలియలేదు. ఈ పొలం మధ్యగా ఒక విశాలమైన రాస్తా

కనపడింది. దానివెంట పోవటానికి వర్ధమానుడు నిశ్చయించాడు. ఆ దారిన ఒక గంట నడిచేసరికి ఒకకంచె వచ్చింది. అది మామూలు కంచెకాదు, మూడు నాలు గంతస్థుల ఎత్తున్నది. ఆ కంచెలో ఒక గేటూ, దాని అవతల మరొక పొలమూ ఉన్నది. దానిమీదిగా యెక్కి అవతలికి దిగటం వర్ధమానుడికి అసాధ్యమయింది. అందుచేత కంచెలో నుంచి దూరుదామనుకున్నాడు.

అతను ఈ ప్రయత్నంలో ఉండగా దభీమని చప్పుడయింది. మళ్లీ అటువంటి చప్పుడే అయింది. ఆ వేపు చూసేసరికి ఒక బ్రహ్మాండమైన రాక్షసుడు—తన ఓడను తరిమిన వాడివంటివాడే—వస్తూ కనిపించాడు. ఈ భూతాన్ని చూచేసరికి వర్ధమానుడికి గుండె జారిపోయింది. చప్పున మొక్కలచాటున దాక్కున్నాడు.

అ రాక్షసుడు గేటుదగ్గిరికివచ్చి గోధుమ పొలంకేసి కాస్సేపుచూచి ఉరుము ఉరిమినట్టు పెద్ద పెడబొబ్బ పెట్టాడు. ఈ కేక విని మరో ఏడుగురు రాక్షసులు చేతుల్లో కొడవళ్లు పట్టుకొనివచ్చారు. కేక పెట్టిన వాడు రైతు. మిగిలిన వాళ్లు కూలీలు. వాళ్లతో గోధుమపంట కొయ్యమని చెప్పాడు యజమాని.

వాళ్లు గేటుదాటి పొలంలోకి వచ్చి కోత ఆరంభించారు. వర్ధమానుడికి చాల భయం వేసింది. ఆ బ్రహ్మాండమైన కొడవళ్ళనుంచి తప్పించుకోవటం ఎట్లా? తన గతి ఏమి కావాలి? అట్లాగే వర్ధమానుడు వాళ్ళ కాళ్ల కింద పడకుండా, కొడవళ్లకు అందకుండా

వేళ్ళతోపట్టుకొని పైకెత్తి తన ముఖం ముందు పట్టుకొని వింతగా చూడసాగాడు. పొరపాటున కిందపడేస్తాడేమో నని వర్ధమానుడి ప్రాణాలు పిచపిచలాడాయి. కాస్సేపు ఇట్లా పరీక్షించి, ఆ కూలీ వర్ధమానుణ్ణి తన తలగుడ్డ మడతలో దాచుకుని యజమానివద్దకు వెళ్లాడు.

"ఇదుగో, ఏమయ్యోయ్? చూశావా ఈ వింత? బుల్లిమడిసి! మన బొటనవేలంత మడిసి! మనలాగే కాళ్లూ, చేతులూ, తలా అన్నీ ఉన్నై!" అన్నాడు కూలీ.

"ఏడిచావులే, యెదవా! పోయి పని చూచుకో!" అన్నాడు యజమాని. కూలివాడు తన గుడ్డ మడతలో నుంచి వర్ధమానుణ్ణి జాగ్రత్తగా పైకి తీసేసరికి యజమాని ఆశ్చర్యానికి మేరలేదు. అందరూ చేరారు. ఇటువంటి వింత ఎవరూ చూడలేదంటే చూడలే దనుకున్నారు. వాళ్లంతా చుట్టూ కూర్చుని మధ్యప్రదేశంలో వర్ధమానుణ్ణి పెట్టి ఏంచేస్తాడో అని ఆత్రంగా చూశారు.

తప్పించుకుంటూ పారిపోసాగాడు. కాని కొంతసేపటికి అతను ఒక మూల ఇరికి దారిలేకుండా పోయింది. అందుచేత వర్ధమానుడు మునివేళ్లమీద నిలబడి కూలివాని కేసి పెద్ద కేకపెట్టాడు.

కోస్తున్న కూలీ ఈ కీచు కేక విని, కొయ్యటం అపి, పరికించిచూశాడు. కొంతసేపు చూడగా వర్ధమానుడు కనిపించాడు. వాడి కళ్లు ఆశ్చర్యంతో బయటికి వెళ్లుకొచ్చాయి. వర్ధమానుణ్ణి జాగ్రత్తగా రెండు

MT.Y.

వర్ధమానుడికి ఈ రాక్షసులభాష తెలియదు గనక వాళ్లు ఏమనుకొన్నదీ అతనికి అర్థంకాలేదు. అతను తన భాషలో వాళ్లతో ఈ విధంగా చెప్పుకున్నాడు:

" నేనుకూడా మీలాటి మనిషినే. నాకూ భగవంతుడు బుర్ర ఇచ్చాడు. అందుచేత మీరు కరుణించండి. హింసించకండి. "

అంత చిన్నమనిషికూడా మాటలునేర్చి మాట్లాడటం వాళ్లకి ముచ్చట వేసింది. అతని మాటలు అర్థంకాకపోయినా అతను పెట్టేదణ్ణాలు వారికి కొద్దిగా అర్థమయాయి. రైతు తన కూలీలను పనిలోకి తిరిగిపొమ్మని చెప్పి, వర్ధమానుణ్ణి చేతిగుడ్డలో చుట్టి జేబులో పెట్టుకుని తన పెళ్ళానికి పిల్లలకీ చూపించటానికి ఇంటికి వెళ్లిపోయినాడు.

రైతు ఇల్లు చేరేటప్పటికి భోజనాలవేళ అయింది. రైతు తన భార్యదగ్గిరికి వెళ్లి, జేబులోనుంచి గుడ్డతీసి, వర్ధమానుణ్ణి ఆమెకు చూపించాడు. అంత చిన్నమనిషిని చూడగానే ఆమె తుళ్ళిపడి, కెవ్వున అరిచింది.

"ఆకారం చిన్నదిగాని జాగ్రత్తగాచూస్తే అంతా మనవంటి మనిషే. భయంలేదు, చూడు!" అంటూ రైతు వర్ధమానుణ్ణి భార్యచేతిలో పెట్టాడు. ఆమె కొన్నిసంజ్ఞలు చేసి అవి వర్ధమానుడికి అర్థమైనా యని తెలుసుకుని ముగ్ధురాలై పోయింది.

అతన్ని మధ్యపెట్టుకొని రైతూ, రైతు భార్యా, పిల్లలూ, ముసలమ్మా భోజనాలకు కూర్చున్నారు. అతని ముందుకూడా రెండు మెతుకులు వేశారు. అతను వాటిని రెండు చేతులా పట్టుకొని ఉపాయంగా, ముఖానికి అంటకుండా తింటుంటే వాళ్ళంతా విరగబడి నవ్వుతూ సరిగా భోజనం చెయ్యలేక పోయినారు.

[ఇంకా వుంది]



[గతసంచిక తరువాయి]

భోజనాలు అవుతుండగా రైతుకొడుకు చప్పున వర్ధమానుణ్ణి కాలుపట్టుకుని పైకెత్తి చేతిలో అటూ ఇటూ తిప్పి చూడసాగాడు. వర్ధమానుడి పై ప్రాణాలు పైనే పోయినాయి. ఆ ఎత్తునుంచి ఆ కుర్రవాడు తనను జారవిడిస్తే చావుతప్పదు. కాని వాడిధర్మమా అంటూ రైతు తనకొడుకును కొప్పడి వర్ధమానుణ్ణి సురక్షితంగా కిందదించాడు.

భోజనా లయినాక రైతుభార్య వర్ధమానుణ్ణి జాగ్రత్తగా పట్టుకొని తీసుకుపోయి ఒక పక్కమీద పడుకోపెట్టింది. ఆ మంచం అంచునుంచి కిందికిచూస్తే వర్ధమానుడి కళ్లు తిరిగిపోయాయి. అంత పెద్దపక్క అత నెన్నడూ చూడలేదు. దాని మీది దిండ్లే మామూలు పరుపులకు ఎన్నో రెట్లున్నాయి. ఆ పక్కలో పడుకుని వర్ధమానుడు గాఢనిద్రలో మునిగిపోయాడు.

అతనికి మెళుకువ వచ్చేసరికి అర్ధరాత్రి అయింది. అంతటా నిశ్శబ్దంగా ఉంది. "ఈ రాక్షసుల మధ్యనుంచి నేను ప్రాణాలతో బయటపడగలనా? ఇక్కడ ఇంకా ఎన్ని ఆపదలు ఎదురొస్తాయో?" అని వర్ధమానుడు చింతిస్తూ ఉండగానే భయంకరమైన అలికిడి అయింది. అదేమిటో అని అతను చూసేసరికి రెండు ఎలుకలు కలుగులోనుంచి వచ్చి ఒకదాని వెంట ఒకటి చరచరా గదియావత్తూ తిరగసాగాయి.

ఆ ఎలుకలు చిన్న దున్న పోతులంతేసి ఉన్నాయి. వాటిని చూసి వర్ధమానుడు చాలా కంగారు పడ్డాడు. అతని భయానికి

జోనాథన్ స్విఫ్టు వ్రాసిన 'గల్లివర్స్ ట్రావెల్సు'కు అనుకరణ

తగ్గట్టుగానే వాటిలో ఒకటి చెంగున అతని మంచంమీదికి ఎగిరి నల్లగామెరిసే పింగాణి బొమ్మలవంటి కళ్లతో అతనికేసి చూసి, ముందుకాళ్లు రెండూ ఎత్తి అతనిమీదికి దూకింది. అతనిఒరలో కత్తి ఉంది. వర్ధమానుడు ధైర్యం చిక్కబట్టి కత్తిదూసి ఆ ఎలుక గుండెలో బలంగా పొడిచాడు. అది తక్షణమే చచ్చి పడిపోయింది. ఇంతలోనే రెండవ ఎలుకకూడా మంచంమీదికి దూకింది. వర్ధమానుడు దానిమీదికి కత్తి విసిరాడు. చిన్నగాయంతో అది తప్పించుకు పారిపోయింది.

వర్ధమానుణ్ణి యెవరు సాకట మనేది సమస్య అయింది. ఆఖరుకు అతన్ని రైతు కూతురయిన చిత్రలకు యిచ్చి జాగ్రత్తగా ఆడుకోమన్నారు. ఆమెకు తొమ్మిదో ఏడు. ఏడుగురు మనుష్యుల ఎత్తున్నప్పటికీ వారి లెక్కకు ఆమె పొట్టిపిల్ల. ఆమె చాలా సాధువు. అందుచేత వర్ధమానుడికి ఏమీ అపకారం జరగదని రైతు నమ్మాడు.

"ఇది నా బుల్లిపాప. దీన్ని నేను నా బొమ్మలతొట్టిలో పెట్టుకొని చక్కగా రోజల్లా ఆడుకుంటాను" అనుకున్నది చిత్రల.

ఆమె తన బొమ్మలతొట్టిలో మెత్తని గుడ్డలు పరిచి అందులో వర్ధమానుణ్ణిపెట్టి, ఎలుకల కందకుండా, ఎత్తుగా గూట్లో దాచింది. రాత్రంతా వర్ధమానుడు అందులోనే గడిపేవాడు. పగలల్లా తన వెంట తిప్పి తన స్నేహితురాళ్లకి చూపుతూ, అతనికి ఒక్కొక్క మాటచొప్పున తమ దేశ భాష నేర్పింది. అతనికోసం కష్టపడి చొక్కాలూ, లాగులూ కూడా కుట్టింది. అంతంత చిన్న బొమ్మగుడ్డలు కుట్టటం ఆమె కెంతో కష్టమయింది.



చిత్పల తండ్రికి ఒక బుల్లిమనిషి దొరికిన వార్త చుట్టుప్రక్కలవారికి తెలియకుండా ఉంటుందా? వర్ధమానుణ్ణి చూడటానికి ఇరుగు పొరుగు వాళ్లు తీర్థప్రజగా రాసాగారు. చిత్పల తండ్రితో కొందరు రైతుస్నేహితులు, "చూస్తా వేమిటి? ఇంత మంచి వింత దగ్గిర పెట్టుకుని; ఎంతయినా డబ్బు చేసుకోవచ్చునే!" అన్నారు. రైతుకీ ఆ సలహా నచ్చింది. వర్ధమానుణ్ణి సంతకు పట్టుకెళ్లి టిక్కెట్లుపెట్టి జనానికి చూపితే ఎంత డబ్బయినా వస్తుంది. ఈ పని ఇదివరకే చెయ్యనందుకు చాల విచారించాడు రైతు. అయిందేదో అయిపోయింది గనక మర్నాడు సంతకు తీసుకుపోవటానికి 'బుల్లిపాపను' సిద్ధం చెయ్యమని చిత్పలతో చెప్పాడు.

తన బుల్లిపాపను ఇట్లా సంతలో పెట్టి తన తండ్రి డబ్బుచేసుకోవటం చిత్పలకేమీ ఇష్టంలేదు. అది తన బుల్లిపాపకెంతో అవమానం. అదీకాక డబ్బిచ్చి ముదనష్టపు మనుషులంతా తన బుల్లిపాపను కాలూ చెయ్యా విరిచి బాధిస్తారేమో అనే భయంకూడా చిత్పలకు లేకపోలేదు. ఈ విషయాలన్నీ చిత్పల చిన్నిపాపతో చెప్పి ఏడిచింది. ఆమెకు తన తల్లిదండ్రులమీద చాలా కోపము కూడా వచ్చింది. సంతకు పట్టుకెళ్లి డబ్బులు తీసుకుని అందరికీ చూపదలచుకొన్నవాళ్లు బుల్లిపాప తనదే నని ఎందుకు చెప్పాలే? కిందటేడు కూడా ఇంతే; మేకపిల్లను తనకు ఆడుకో నిచ్చి అది కాస్త వొళ్లు చెయ్యగానే కసాయివాడికి అమ్మేశారు. ఏం మనుషులు?

కాని వర్ధమానుడు ఆమెను ఊరడించి "ఊరుకో, ఏడువకు. నాకేమీ ఆపద రాదు

నాకు కూడా అందర్నీ చూడాలనీ, ఎక్కడికైనా వెళ్లాలనీ ఉంది. నువు వెంట రాకుండా మీ నాన్నగారు నన్ను సంతకు తీసుకుపోడులే. నేను నీ మాట తప్ప ఎవరి మాటా విననుగా!" అన్నాడు. వర్ధమానుడికి సంత కెళ్ళటం నిజంగా ఏమాత్రమూ ఇష్టంలేదు. కాని ఇల్లుదాటి బయటికి వెళ్లితే తప్పించుకుని పారిపోయే మార్గం ఏదైనా దొరుకుతుందేమో నని అతని ఆశ.

ఒక పెట్టెలో మెత్తలు పరిచి, అందులో వర్ధమానుణ్ణి పెట్టి, అతనికి ఊపిరాడటానికి పెట్టెకు కంతలుచేసి, అతను బయటికీ లోపలికీ రాగలందులకు, పెట్టెకు తలుపొకటి పెట్టారు. ఆ పెట్టెను గుర్రంమీద పెట్టుకొని రైతూ, చిత్రలా తెల్లవారు ఝామునే సంతకిబయలుదేరారు. భోషాణంలాగున్న ఆపెట్టెలో వర్ధమానుడు సుఖంగా కూర్చున్నాడు. చిత్రల ఆ పెట్టెను తానే పట్టుకుంది. ఇప్పుడు వర్ధమానుడు డబ్బు తెచ్చే సాధనం కనక రైతుకూడా అతని విషయం ఎంతో శ్రద్ధగా ఉన్నాడు.

అయితే గుర్రం నడక వర్ధమానుడికి చాల బాధకలిగించింది. అది బ్రహ్మాండమైన అంగలువేస్తూ పోతుంటే వర్ధమానుడికి



గాలిలో ఎగురుతూ పడుతూ పోతున్నట్టున్నది. తుపానులో కొట్టుకునే పడవలో ఉన్నప్పటికీ అతనికింత బాధ కలిగి ఉండదు.

ఎట్లాగైతేనేం సంతకు వచ్చారు. అక్కడే సత్రంలో ఒక గదికి అద్దె యిచ్చి రైతు "బుల్లిపాప"ని ప్రదర్శనానికి పెట్టాడు. గది మధ్య ఒక ఎత్తయిన బల్ల పెట్టారు. బల్లమీద వర్ధమానుణ్ణి నిలబెట్టారు. అతని పక్కనే ఆ బల్లమీదే చిత్పల కూర్చున్నది—అతనికి ఆ పనీ ఈ పనీ చెప్పి చేయించటానికి. ప్రదర్శనం ఆరంభమైన మరుక్షణంలోనే ప్రేక్షకులు ఇసకవేస్తే రాలకుండా కిక్కిరిసిపోయి ఒకరినొకరు తోసుకోసాగారు. వారంతా "బుల్లిపాప" గురించి అనేక సంగతులు ఇదివరకే విన్నారు. అదంతా కళ్లారా, చూసేటందుకిప్పుడు వారికి అవకాశం దొరికింది.

చిత్పల తనభాషలో వర్ధమానుడికి కొన్ని ప్రశ్నలువేసి ఆ భాషలోనే సమాధానాలు చెప్పించింది. ఇంత బుల్లిమనిషి తమ భాష మాట్లాడడంవిని అక్కడచేరిన మూఢ ప్రజలు పొట్టలు పట్టుకొని నవ్వసాగారు. ఆ తరవాత చిత్పల తన బుల్లిపాపను నడవమన్నది. చిన్న ఉగ్గుగిన్నెలో మంచి నీళ్లు పోసి అతన్ని తాగమన్నది. వర్ధమానుడు ఈ పనులన్నీ చేశాడు. అటు తరవాత అతను తన కత్తిదూసి సాముచేసి చూపించాడు. చిత్పల అతనికొక గడ్డిపరక అందించింది. దాని సహాయంతో వర్ధమానుడు రకరకాల మొగ్గలు వేశాడు. ఇవన్నీ చూసి ప్రేక్షకులు ముక్కుమీద వేలు వేసుకుని విస్తుపోయినారు.

ఈ విధంగా వర్ధమానుడు తన యజమాని అయిన రైతుకు డబ్బు చేసిపెట్టసాగాడు. వర్ధమానుడివల్ల డబ్బు రావటం

MTV

ఆరంభం కాగానే రైతు స్వార్థ పరుడు కాసాగాడు. వర్థమానుడికి ఎవరివల్లా ఏ అపాయమూ కలగకుండా ఉండగలందు లకు ఆ రైతు, చిత్పల తప్ప మరెవ్వరూ బుల్లిపాపను ముట్టుకోరాదని శాసించాడు. చూడవచ్చేవాళ్ళు చేతులు చాచి వర్థమానుణ్ణి అంటుకోకుండా కట్టుదిట్టాలు ఏర్పరిచాడు.

అయినా ఒకరోజు ఒక అల్లరి పిల్లవాడు వర్థమానుడిమీదికి ఒక చింతగింజ విసిరాడు. కాస్తలో తప్పిపోయింది గాని, ఆ గింజ తలకు తగిలితే వర్థమానుడుకి తల పగిలిఉండవలసిందే. ఆ కుర్రవాణ్ణి మెత్తగా తన్ని గదిలోనుంచి బయటికి గెంటారు, వర్థమానుడి కళ్ళు చల్లగా.

మళ్లీ మళ్లీ ప్రదర్శనాలు జరిగాయి. జనం తండోపతండాలుగా వచ్చేవారు. చేసినపనులే మళ్లీ మళ్లీ చేసి వర్థమానుడు తెగ అలిసిపోయేవాడు. ఒక్కొక్కసారి స్పృహతప్పి కూడా పడిపోయేవాడు. రైతుకుమాత్రం పరమానందంగా ఉండేది. ప్రతిసారీ రెండుజేబులా డబ్బులు నించుకుని రైతు ఇంటికి తిరిగివచ్చేవాడు. బుల్లిపాప ధర్మమా అంటూ రైతుదరిద్రం తీరేటట్టు కనిపించింది.

సంతలో ప్రదర్శనాలద్వారా డబ్బు సంపాదించటం రైతుకు మామూలువిషయమైపోయి పెద్ద ఆలోచనలు చెయ్యసాగాడు. పట్టణానికి వెళ్లి "బుల్లిపాప"ను ఆస్థానంలో ప్రదర్శిస్తే అప్పుడుగాని ఐశ్వర్యం అందుకోదు. ఇక్కడ ఈ మారుమూల పల్లెటూళ్లలో ఎన్నిప్రదర్శనాలు పెట్టి ఏంలాభం?

రైతు తనభార్యకు ముందుగా ఈ ఆలోచన చెప్పి చిత్పలతో ఇట్లా అన్నాడు:

"మనమే... బుల్లిపాపను తీసుకుని రాజుగారిదగ్గిరికి వెళ్ళామంటే... రాజూ రాణీకూడా... మన బుల్లిపాపను చూసీ... ఎంతో సంతోషిస్తారు! చక్కా మనకీ... బోలెడు డబ్బులిస్తారు.... నువ్వే దగ్గిరుండీ ... మన బుల్లిపాపనీ.... రాజుగారికీ.... రాణీగారికీ... చూపిద్దుగాని! ఏం?"

—[ఇంకా వుంది]



[గతసంచిక తరువాయి]

ఈసారి "బుల్లిపాప" పెట్టెను ఇంకా అందంగా అలంకరించారు. అందులో చిత్రపల తన బొమ్మల తొట్టికూడా పెట్టి ఆ తొట్టిలో వర్ధమానుణ్ణి పడుకోబెట్టింది. ఇట్లా చెయ్యటంవల్ల వర్ధమానుడి ప్రయాణం కొంతవరకు సుఖంగా జరిగింది. రైతు గుర్రం ఎక్కాడు. రైతు వెనకగా, చేతిలో పెట్టె పట్టుకుని, చిత్రపలకూడా ఎక్కింది. గుర్రంబయలు దేరింది. బుల్లిపాప ఎక్కడ నలిగిపోతాడో అని చిత్రపల దారిలో అనేక చోట్ల, తనకు ఆయాసంగా ఉందని వంక పెట్టి, తండ్రిచేత మజిలీలు వేయించింది.

రైతు మొత్తంమీద చాలా గడుసువాడు. దారిలోనూ దారికి కాస్త ఎడంగానూ తగిలిన ప్రతి గ్రామంలోనూ ఆగి వర్ధమానుడి చేత ప్రదర్శనాలిప్పించి రెండుచేతులా బోలెడంత డబ్బుచేసుకున్నాడు. ఈ ధనాశ మూలంగా ఆ రైతు వెనకటిమాదిరిగా వర్ధమానుడి కష్టసుఖాలు పాటించటంకూడా మానేసి తన డబ్బే చూచుకోసాగాడు. ఈ కారణంచేత వర్ధమానుని ఆరోగ్యం చెడి అతను నతతగానూ, బలహీనంగానూ తయారై, జాలిగొలిపేటట్టు కనపడటం మొదలుపెట్టాడు. అయితే రైతుకు వర్ధమానుడి వాలకంచూసి జాలికలగకపోగా చిరాకు వేసింది. చచ్చిపోతాడేమో, వచ్చే లాభమంతా పోతుందేమోనని భయంకూడా కలిగింది. ఇంకా చాలా గ్రామాల్లో ప్రదర్శనా లివ్వవలసివుంది కదూ.

"అయ్యో, బుల్లిపాపా! నీ ఆరోగ్యం బాగాలేదు. చచ్చిపోతావే ఏమిటో! నేను సంపాదించే డబ్బంతా సంపాదించేలోగా చచ్చేవు సుమీ!" అన్నాడు రైతు వర్ధమానుడితో. రాచనగరు చేరకపూర్వమే రైతు

జోనాథన్ స్విఫ్టు వ్రాసిన 'గల్లివర్స్ ట్రావెల్సు'కు అనుకరణ

చాలా డబ్బు చేసుకున్నాడు. ఆఖరుకు రాచనగరు చేరారు.

పట్టణంలో అనేకచోట్ల వర్ధమానుణ్ణి ప్రదర్శించటానికి ఏర్పాట్లు జరిగాయి. రైతు ఈ ప్రయత్నాలలో నిమగ్నుడై ఉండగా జనానాలో రాణీగారూ ఆవిడ చెలికత్తెలూ "బుల్లిపాప"ను చూడటానికి తహతహ లాడుతున్నారనీ, వెంటనే వచ్చి అక్కడ ఒక ప్రదర్శనం ఇవ్వవలసిందని రాజ భటులు కబురు తెచ్చారు.

"నాపంట ఈనాటికి పండింది." అనుకున్నాడు రైతు. అతను ఈ మహాభాగ్యం కోసమే ఇన్నాళ్లూ కాచుకుని ఉన్నాడు. రాణీగారి పరివారం ఎదట బుల్లిపాపను ప్రదర్శించినందుకు ఎంత బహుమతి దొరుకునా అని రైతు ఆలోచించసాగాడు.

వర్ధమానుడికి తన యజమానిమీద ఇప్పుడు అవగింజంత అభిమానంకూడా మిగలలేదు. ఆ రైతుకు డబ్బుచేసిపెట్ట లేక అతని ప్రాణం విసిగిపోయింది. ఈ ప్రయత్నంలోనే తన చావు రాసిపెట్టి వుందని వర్ధమానుడు నిశ్చయం చేసుకున్నాడు.

రైతు వర్ధమానుణ్ణి పెట్టెలో పెట్టుకుని చిత్రాలను వెంటబెట్టుకుని సాధ్యమైనంత

వేగంగా రాణీగారి అంతఃపురానికి వెళ్లాడు. రాణీగారి ముందు రైతూ చిత్రలాకూడా వొంగి నమస్కారాలుచేసి బుల్లిపాపను చూపారు. అతన్ని చూడగానే రాణీకి చాలా ముచ్చటయింది.

"నువు చూడటానికైతే చాలా ముద్దొస్తున్నావుగాని ముద్దుగా మాట్లాడటం కూడా నీకు చాతనవునా?" అని రాణీ వర్ధమానుణ్ణి అడిగింది.

"తమ భాష నాకు కొద్దిగా వచ్చును," అని వర్ధమానుడు రాణీగారికి తగినట్టుగా మాట్లాడి, ఆమె దర్శనంవల్ల తన జన్మ ధన్యమయిందన్నాడు. ఈ మాటలువిని రాణీ మరింత మురిసిపోయి, "ఈ పాపను వెయ్యి మొహర్లకు అమ్ముతావా?" అని రైతు నడిగింది.

బుల్లిపాప ఇంక ఎంతో కాలం బతకడని రైతు అదివరకే నిశ్చయం చేసుకున్నాడు. అందుచేత వెయ్యి మొహర్లకు అతన్ని వదిలించుకోవటం రైతుకు చాలా సంతోషంగానే ఉంది. కాని పైకి తన కెంతో కష్టంగా ఉన్నట్టు నటించి చివరకు ఒప్పుకున్నాడు.

"ఏం, బుల్లిపాపా? నీ యజమానిని వదిలి నాదగ్గిర ఉండిపోతావా?" అని రాణీ వర్ధమానుణ్ణి లాలించి అడిగింది.



"అంతకన్న మహాభాగ్యమా? అయితే ఈ చిత్రలనుకూడా నాదగ్గిర ఉంచగలరా? ఆమెను విడిచి ఉండలేను," అన్నాడు వర్ధమానుడు.

"చిత్రల నీదగ్గిరే ఉంటుంది. ఆమెను కూడా నేనే పోషిస్తాను," అన్నది రాణీ. ఈమాటకు రైతుకూడా సంతోషించాడు; తన కూతురి పంటకూడా పండిందను కున్నాడు. అతను రాణీగారిదగ్గిర సెలవు పుచ్చుకుని ఈ శుభవార్త భార్యకు చెప్ప టానికి బయలుదేరాడు.



వర్ధమానుణ్ణి జాగర్తగా తన అరిచేతిలో పెట్టుకుని రాణీ తిన్నగా రాజుగారి దగ్గిరికి వెళ్లింది.

"ఇటువంటి వింత ఎక్కడన్నా చూశారా?" అన్నది రాణీ, వర్ధమానుణ్ణి రాజుకుచూపి. రాజుగారి ఆశ్చర్యానికి మేరలేదు.

"ఎవరు నువు? ఎక్కడినుండివచ్చావు? ఏమిటి నీ వృత్తాంతం?" అని రాజుగారు వర్ధమానుణ్ణి అడిగాడు. వర్ధమానుడు తన కథ యావత్తూ చెప్పగా విని రాజు మరింత ఆశ్చర్యపడ్డాడు.

వర్ధమానుడికి అన్నిరకాల రాజభోగాలూ జరిగాయి. చిత్రల ఎప్పుడూ అతనిదగ్గిరే ఉండేది. అతనికోసం రాణీ చక్కనిపెట్టె చేయించి, దానికి అన్నిప్రక్కలా మెత్తలూ, వాకిళ్లూ, కిటికీలూ, అలమరులూ, అరలూ ఏర్పాటు చేయించింది. అందులోనే కుర్చీలూ, బల్లలూ, ఒక మంచంకూడా అమర్చారు.

అతనికోసం కమసాలివారిచేత బుల్లి వెండి పళ్లాలు చేయించారు. రాణీగారు భోజనంచేసే సమయంలో వర్ధమానుడు కూడా తన చిన్న పళ్లాలలో భోజనం చేసే వాడు. అతను భోజనం చేస్తుంటే చూడటం రాణీకి చాలా ముచ్చటగావుండేది.

ఒకనాడు భోజనాలవేళ వర్ధమానుడికి పెద్దగండం తప్పింది. అది ఎట్లా జరిగిం



దంటే—రాణీదగ్గిర ఒక మరుగుజ్జువాడుండేవాడు. వాడుకూడా వర్ధమానుడికంటె అయిదురెట్లు ఎత్తుండేవాడు. ఈ మరుగుజ్జువాడు ఎవరూ చూడకుండా వర్ధమానుణ్ణి పట్టుకుని ఎత్తి నేతిగిన్నెలో వేసి ఘనకార్యం చేసినవాడల్లే కేరింతాలు పెట్టి నవ్వుకుంటూ పారిపోయినాడు. కొన్ని క్షణాలపాటు రాణీ, చిత్పలాకూడా విస్తుపోయి ఏమీ చెయ్యలేక పోయినారు. ఆ తరవాత చిత్పల అతన్ని రక్షించి పైకి తీసింది. వర్ధమానుడికి ఈత చాతకాపటం వల్ల ప్రాణం దక్కింది. అప్పటికీ అతను చాలా నెయ్యి మింగి కొంతసేపటివరకూ తేరుకోలేక పోయినాడు.

ఆ తరవాత ఆ మరుగుజ్జును పట్టుకుని మెత్తగా తన్నారు. ఈ తన్నులు వాడికి వెనకనే తగిలివుండవలసింది. ఎందుకంటే కొంతకాలం క్రితం ఒకసారి భోజనాల దగ్గిర ఈ మరుగుజ్జే వర్ధమానుణ్ణి ఒక ఎముకలో నడుమువరకూ దూర్చాడు. అప్పుడు మరుగుజ్జుకు శిక్షపడకుండా వర్ధమానుడే అడ్డపడ్డాడు. కాని ఈ తప్పుతో మరుగుజ్జుకు ఉద్వాసన అయింది.

వర్ధమానుడు అంతఃపురంలో రెండు సంవత్సరాలు గడిపాడు. అతనికి మహా వైభవంగా జరిగింది. కాని ఈజీవితం అతనికి తృప్తికలిగించలేదు. ఈ రాక్షసుల దేశంనుంచి ఎట్లా తప్పించుకుని తన సాటి మానవులమధ్య స్వేచ్ఛగా జీవింతామా అని అతను ఆరాట పడసాగాడు.

ఇట్లా ఉండగా రాజూ, రాణీ ఒకసారి సముద్రతీరానఉన్న ఒక గ్రామానికి రాచకార్యంమీద వెళ్లవలసివచ్చింది. రాణీ వెంట చిత్పలా, తన పెట్టెలో వర్ధమానుడూ కూడా వెళ్లారు. ఆ ప్రయాణంవల్ల చిత్పలకూ వర్ధమానుడికీకూడా చాలా బడలిక అయింది.

“నాకు శరీరంలో ఏమీ బాగాలేదు. ఒక్కసారి సముద్రపుగాలి తగిలితే



బాగుండును!" అన్నాడు వర్ధమానుడు. కనీసం సముద్రంచూసి అయినా సంతోషింతామని అతని ఆశ.

చిత్పల అతన్ని వెంటపెట్టుకుని వెళ్లే స్థితిలో లేకపోవటంవల్ల ఆమె, ఒక నౌకరు కుర్రవాడికి బుల్లిపాప పెట్టె ఇచ్చి, జాగ్రత్తగా కాపాడమని ఎంతో గట్టిగా చెప్పి పంపింది.

కాని ఆ నౌకరు కుర్రవాడికి ఏమీ బాధ్యత తెలియదు. వాడు వర్ధమానుడి పెట్టెను సముద్రతీరాన రాళ్లమీద ఉంచి పక్షులగుడ్లు దొంగిలించటానికి వెళ్లిపోయాడు.

ఈ సమయంలో ఒక గద్దవచ్చి వర్ధమానుణ్ణి పెట్టెతోసహా కాళ్లతో తన్నుకుని సముద్రంమీదికి ఎగిరిపోయింది.

"బుల్లిపాప"ను సముద్రం అలలు మింగేశాయని చిత్పలా, రాణీ అనుకుని దుఃఖించారు. కాని నిజానికి వర్ధమానుడు సముద్రంలో మునిగిపోలేదు. అతన్ని తన్నుకుపోయిన గద్ద సముద్ర మధ్యంలో అతని పెట్టెను జారవిడిచింది.

ఆ పెట్టె చాలాసేపు అట్లాగే నీటిమీద తేలుతూ ఉండి దూరంగాపోయే ఒక ఓడ కంటపడింది. ఆ ఓడయజమానులు వర్ధమానుణ్ణి రక్షించి అతని సమాచారం తెలుసుకుని అతన్ని వాళ్లదేశం చేర్చారు.

ఆ తరవాత వర్ధమానుడు దేశాలు తిరగటం మానివేసి పెళ్లాడి పిల్లల్నికని వ్యాపారం చేసుకుంటూ సుఖంగా బతికాడు. అతని బిడ్డలూ, మనమలూ ఎప్పుడూ అతనిచేత ఈ వింతవింత విషయాలు చెప్పించుకుని ఎంతో ఆశ్చర్యపడుతూ వినేవారు. వర్ధమానుడి అనుభవాలు మీకుమాత్రం ఆశ్చర్యకరంగా లేవూ?

(అయిపోయింది)